క్లుప్తంగా

ఎఫ్‌ఏ-3 పరీక్షలు ప్రారంభం



ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్‌ఏ-3) పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 1 నుంచి 8 తరగతుల వారికి (సీబీఏ-2) క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలు, 9, 10 తరగతుల వారికి గతంలో మాదిరిగానే ఎఫ్‌ఏ-3 పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులకు రోజూ రెండు పూటలు (ఉదయం, మధ్యాహ్నం) పరీక్షలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు మాత్రం ప్రశ్న పత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉండగా విద్యార్థులు జవాబును గుర్తించి ఓఎంఆర్ షీట్‌లో బబుల్ చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రం యథావిధిగా పరీక్షలు రాశారు.

సచివాలయాల సేవలు మెరుగుపరచాలి



18వ వార్డు సచివాలయంలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో సచివాలయాల సేవలు మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం 18, 19వ వార్డుల పరిధిలోని ఇందిరానగర్, మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్, ఎరుకల కాలనీ తదితర ప్రాంతాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరును పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తతో పక్కాగా నిర్వహించాలని సూచించారు. సర్వే పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

పెద్దకడబూరు: వైఎస్సార్ బీమా పేదలకు వరం అని సర్పంచ్ రామాంజనేయులు పేర్కొన్నారు. పెద్దకడబూరుకు చెందిన మొట్రు నాగమ్మ (46) అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన తక్షణ సాయం రూ.10 వేలను వెల్ఫేర్ అసిస్టెంట్ జయలక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచ్ మంగళవారం ఆమె భర్త మొట్రు బాబుకు అందించారు. వారు మాట్లాడుతూ మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

పకడ్బందీగా కులగణన సర్వే



కోసిగిలో కులగణన సర్వే చేస్తున్న సిబ్బంది

కోసిగి: కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కోసిగిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి కులగణన సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేపట్టాలని సూచించారు. సర్వేను 28వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా పూర్తి చేయాలన్నారు. వీఆర్వో లింగన్న, మహిళా పోలీస్ అంజమ్మ, ఏఎన్‌ఎం సుజాత, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన విజయలక్ష్మిని తన భర్తతో పాటు అత్తమామలు వేధించి హింసిస్తున్నారని సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ మన్త్రిస్వామి మంగళవారం తెలిపారు. విజయలక్ష్మిని ఆదోని పట్టణానికి చెందిన జగదీష్ పెళ్లి చేసుకున్నాడని, పెళ్లి అయిన తర్వాత కొన్నేళ్ల నుంచి భర్తతో పాటు అత్త ఈరమ్మ, మామ వెంకటేష్ వేధింపులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని మదార్‌పురానికి చెందిన రామాంజనేయులు మంగళవారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య నాగ సోమేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు.. రామాంజనేయులు వెల్దుర్తిలో పలు వ్యాపారాలు చేశాడు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కూల్‌డ్రింక్ షాపు సైతం మార్చి మరో వ్యాపారానికి పూనుకున్నాడని తెలుసుకున్న భార్య వారించింది. రాత్రి కుటుంబ సభ్యులందరూ నిద్రకు ఉపక్రమించగా రామాంజనేయులు ఇంటి హాలులో ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. గమనించిన భార్య కుటుంబ సభ్యులతో కలిసి కిందకు దింపారు. అపస్మారక స్థితికి చేరుకున్న రామాంజనేయులును వెల్దుర్తి ఆసుపత్రికి, అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక రామాంజనేయులు మృతి చెందాడు. మృతుడికి ఇరువురు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

అక్కాచెల్లెమ్మలకు కొండంత ఆసరా



పొదుపు మహిళలతో కలిసి సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి

కోసిగి: అక్కాచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాసటగా నిలిచారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోసిగి మండలం పల్లెపాడు సచివాలయ కార్యాలయంలో.. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత నిధుల విడుదల కార్యక్రమం, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగం లైవ్‌ను కంప్యూటర్ ద్వారా పొదుపు మహిళలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న మాటిస్తే తప్పరని ఉద్ఘాటించారు. గత ఎన్నికల తేదీ 11 ఏప్రిల్ 2019 నాటికి పొదుపు మహిళలకు ఉన్న బ్యాంకు రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేశారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద మంత్రాలయం నియోజకవర్గంలో నాలుగు విడతల్లో 3114 పొదుపు గ్రూపుల్లోని 31,140 మంది పొదుపు మహిళలకు రూ.57.23 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే ఆ కుటుంబం బాగుంటుందని నమ్మి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి, ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, గ్రామ నాయకులు లంకా రెడ్డి, నరసయ్య, తిమ్మారెడ్డి, నరసింహులు, రామాంజినేయులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.57.18 కోట్ల ఆసరా

ఆదోనిటౌన్: వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో ఆదోని నియోజకవర్గానికి రూ.57.18 కోట్లు పైగానే పొదుపు మహిళల ఖాతాల్లో జమ అయ్యింది. ఎన్నికల ముందు పొదుపు, స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన మాట మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం కింద రుణాలు మాఫీ చేశారని ఎమ్మెల్యే చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆదోని పట్టణంలో 1575 గ్రూపుల్లోని 15,750 మంది సభ్యులకు రూ.9,17,3,026 మొదటి విడతలో జమ అయ్యిందన్నారు. రెండు, మూడు, నాలుగు విడతల్లోనూ అదే మొత్తం జమ చేశారు. ఆదోని మండలంలో 1174 గ్రూపుల్లోని 11,700 మంది సభ్యులకు రూ.5,16,90,000 ఆసరా కింద అందించారు. నాలుగేళ్లలో రూ.20.50 కోట్లును పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఒక్క ఆదోని నియోజకవర్గానికే నాలుగేళ్లలో 27,450 పొదుపు సంఘాల మహిళలకు రూ.57.18 కోట్లను ఆసరా పథకం కింద అందించినట్లు వివరించారు. ఈ పథకం కింద లబ్ధి పొందిన మహిళలు జీవన విధానాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

క్రీడాస్ఫూర్తితో రాణించాలి

కౌతాళం: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తితో రాణించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి సూచించారు. ఆయన మంగళవారం జైభీమ్ యూత్ నాయకులకు వాలీబాల్ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడకారులకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, పలువురు పాల్గొన్నారు.

27 నుంచి వాలీబాల్ పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నీలకంఠేశ్వర స్వామి జాతర పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 27వ తేదీ నుంచి వైఎస్సార్ అంతర్రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీకి సంబంధించి పోస్టర్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన నివాసంలో నాయకులు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆర్గనైజర్లు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116 అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 96668 33933, 80740 58451 నంబర్లను సంప్రదించాలన్నారు.

సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం



పల్లెపాడులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: సంక్షేమ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోసిగి మండలం పల్లెపాడు గ్రామంలో రెండవ రోజున వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరును వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని జగనన్న పాలనలోనే చూస్తున్నామన్నారు. సర్వవర్గాల అభ్యున్నతి కోసం సీఎం చేస్తున్న కృషి అమోఘమన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాలతోనే తమ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ శాయశక్తులా కృషి చేస్తున్నామని, పల్లెపాడు గ్రామంలో రూ.40 లక్షలతో జల జీవన్ మిషన్ కింద బోర్లు వేయించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయిస్తామన్నారు. రోడ్డు పనులు చేయిస్తున్నట్లు వివరించారు. అనంతరం సచివాలయ కార్యాలయం తనిఖీ చేసి రికార్డు పరిశీలించారు. జగనన్న ఆశయ సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎస్‌ఐ సతీష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, జగదీష్ స్వామి, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రెండో అదనపు న్యాయమూర్తి నియామకం



న్యాయమూర్తి ఆత్మకూరి వెంకటసాయి శ్రీవల్లిని సన్మానిస్తున్న అనితాభాయి

ఆదోనిరూరల్: ఆదోని రెండో అదనపు న్యాయమూర్తిగా ఆత్మకూరి వెంకటసాయి శ్రీవల్లి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనితాభాయి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఆదోని అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన న్యాయమూర్తులకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. అనంతరం ఆత్మకూరి వెంకటసాయి శ్రీవల్లి మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ మధ్య సఖ్యత కోసం అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. బార్ అసోసియేషన్ నాయకులు అంజినప్ప, అబ్దుల్‌అన్సారీ, సవితారాణి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తెరచుకున్న అంగన్‌వాడీ పాఠశాలలు

ఆదోని సెంట్రల్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె విరమించడంతో అంగన్‌వాడీ సెంటర్లు మంగళవారం తెరుచుకున్నాయి. 42 రోజుల తరువాత సెంటర్లు తెరుచుకోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపారు. ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించడంతో యథావిధిగా కార్యకర్తలు, హెల్పర్లు తమ విధులకు హాజరయ్యారు. ముఖ్యంగా 11 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచగా వాటిని అమలు చేసే విధంగా కార్యచరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంగనవాడీల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పదవీవిరమణ బెనిఫిట్స్ కార్యకర్తలకు రూ.50 వేల నుంచి ఏకంగా రూ.1.20 లక్షలకు పెంచింది. హెల్పర్లకు రూ.20 వేల నుంచి రూ.60 వేలకు పెంచారు. పదవీవిరమణ వయస్సు 60 నుంచి 62 ఎళ్లకు, ప్రమోషన్ల కోసం వయస్సు 45 నుంచి 50 ఏళ్లకు పెంచారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో చనిపోతే మట్టి ఖర్చులకు ఆ కుటుంబానికి రూ.20 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. తమ డిమాండ్లకు ప్రభుత్వం సమ్మతించడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో మంగళవారం గ్రామీణ ప్రాంతంలోని 92 అంగన్‌వాడీ సెంటర్లు, పట్టణంలోని 126 సెంటర్లు తెరుచుకున్నాయని ఆదోని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మాలాదేవి తెలిపారు.

వ్యక్తిపై దాడి

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామానికి చెందిన బైరాపురం వెంగన్న, మధు, సుధాకర్, రేమట చిన్న మాధవరావు, పెద్ద మాధవరావుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన బోయ ముచ్చు రామచంద్ర ఈ నెల 22న సాయంత్రం పోతుగల్లు గ్రామానికి బంధువు సుబ్బారెడ్డిని పలకరించేందుకు వెళ్లాడు. ఇతను గతంలో బైరాపురం వెంగన్న ఇసుక ట్రాక్టర్‌ను అధికారులకు పట్టించారనే నేపంతో పైన తెలిపిన ఐదుగురు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

కృష్ణగిరి గ్రామ శివారులోని ఊటకుంట వద్ద నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో మంగళవారం సాయంత్రం ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. గ్రామానికి చెందిన పడిగే సుధాకర్‌కు చెందిన 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తయారీదారుడు పారిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డెంగ్యూ కేసు నమోదు

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో 16 ఏళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా మంగళవారం తెలిపారు. గ్రామంలో బాలుడి ఇంటి పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కువ రోజులు తొట్టెల్లో గానీ, డ్రమ్ముల్లో గానీ నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలన్నారు. సూపర్‌వైజర్ రంగస్వామి, సిబ్బంది ఉన్నారు.

మండల సమావేశాలకు హాజరుకావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి జరగాలంటే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల పరిషత్ కార్యాలయంలో మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు తప్పక హాజరు కావాలని ఎంపీపీ శ్రీవిద్య పేర్కొన్నారు. మంగళవారం సర్వసభ్య సమావేశానికి హాజరు కాని వారిపై ఎంపీపీ మండిపడ్డారు. సమావేశానికి వస్తే వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బసలదొడ్డి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు గవిగట్టు ఆంజనేయ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే మాజీ ఎంపీపీ శకుంతలమ్మ భర్త బి.సోమశేఖర్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ పురుషోత్తంరెడ్డి మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఇర్ఫాన్‌దేశాయ్, వైస్ ఎంపీపీ-2 ముత్తమ్మ, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంఈఓలు సువర్ణల సునీయం, రామమూర్తి, ఆర్‌ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



జాతీయ రహదారి మహోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, అధికారులు

ఆదోనిరూరల్/ఆదోనిఅర్బన్: జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. గత మాసంలో జరిగిన రోడ్డు సేఫ్టీ సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలలో భాగంగా ఆదోని పట్టణంలో పంజరాపోల్ గోశాల సమీపంలో రోడ్డు మలుపు వద్ద, నెట్టేకల్ క్రాస్ రోడ్డు దగ్గర తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్పీడు బ్రేకర్లు, రోడ్డుపై రంగుల సూచికల ఏర్పాటు గురించి ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడు వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జాతీయ రహదారి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదోని, ఎమ్మిగనూరు డీఎస్పీలు శివనారాయణస్వామి, సీతారామయ్య, ఆర్టీఓ నాగేంద్ర, ట్రాఫిక్ సీఐ మంజునాథ్, ఎంవీఐ సిసిరాదీప్తి, అసిస్టెంట్ ఎంవీఐ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, పంచాయతీరాజ్ ఈఈ వెంకటప్రసాద్, పోలీసు, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

26 నుంచి కాశీంస్వామి ఉరుసు



పెండేకల్లులోని కాశీం స్వామి దర్గా

తుగ్గలి: మత సామరస్యానికి ప్రతీకగా విరాజిల్లుతున్న పెండేకల్లు కాశీంస్వామి ఉరుసు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది. 26న గంధం, 27న ఉరుసు, 28న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని గ్రామపెద్దలు పేర్కొన్నారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఉరుసుకు గ్రామస్తులు బంధుమిత్రులను ఆహ్వానించి మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. స్వామి దర్గాను దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కాశీం స్వామిపై ఉన్న భక్తితో గ్రామంలో అనేక మంది ఆయన పేరు పెట్టుకొని భక్తిని చాటుకుంటున్నారు. ఉరుసు సందర్భంగా 27న చెక్క భజన, 28న పంచమాంకములు ఉచిత నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్యురాలి నిర్లక్ష్యంపై విచారణ



మొలగవెల్లి పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి పీహెచ్‌సీలో వైద్యురాలి నిర్లక్ష్యంపై మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి విచారణ చేపట్టారు. 24 గంటలు వైద్య సేవలందిచాల్సిన పీహెచ్‌సీలో వైద్యురాలు శాంతి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై గ్రామస్తులు ఈ నెల 8న జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, డాక్టర్ మురళి, గ్రామస్తుల సమక్షంలో పీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. స్థానికులు భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు తదితరులతో మాట్లాడి అభిప్రాయం నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రజల పార్టీ వైఎస్సార్‌సీపీ



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజల మదిలో నుంచి పుట్టుకొచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎంతమంది కుట్రలు పన్నినా వైఎస్సార్సీపీని ఏమీ చేయలేరన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం రెండో రోజూ మంగళవారం ప్రకాష్‌నగర్, కల్లుబావి, భీమిరెడ్డినగర్, వైఎస్సార్‌నగర్‌లలో కొనసాగింది. యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత, కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి, పట్టణాధ్యక్షుడు దేవా, వార్డు ఇన్‌చార్జ్ గోవిందుతో కలిసి ఇంటింటికీ కలియ తిరిగారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను దోచుకు తిన్నారని ఆరోపించారు. జగనన్న పాలనలో అవినీతి లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నారని కొనియాడారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే రాష్ట్రంలో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ నరసింహులు, నాయకులు, కార్యకర్తలు సన్ని, గణేష్, ఈశ్వర్, రాము, శ్రీనివాసరెడ్డి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



విద్యా సామగ్రి పంపిణీ చేసిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మంత్రాలయం మండలం తుంగభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేతాజీ జయంతి పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న 290 మంది విద్యార్థులకు యువనేతలు దశరథ్ రెడ్డి, ఉమేష్ రెడ్డి సహకారంతో పెన్నులు, పరీక్ష ప్యాడ్, జామెంట్రీ బాక్స్‌లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులకు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌతాళం: నేతాజీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని డాక్టర్ పండిత్ పుట్టరాజ గవాయి ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు. కౌతాళంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించిన మహానాయకుడు సుభాష్ చంద్రబోస్ అంటూ కొనియాడారు.



ఆదోనిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోనిఅర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూత్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక వివేకానంద ట్రస్టు కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు శ్రీనివాస ఆచారి, మోహన్, వినయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిఅర్బన్: స్థానిక బీజేపీ కార్యాలయంలో భారతీయ జనతా యువమోర్చా పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో దృఢమైన సైన్యాన్ని తయారు చేసి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాండించిన నేత సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. బీజేవైఎం నాయకులు అజయ్‌కుమార్, రాహుల్‌చవన్ తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. పశువులకు ముందు జాగ్రత్తతో గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులకు దూరంగా ఉంచాలన్నారు. పాడి రైతులు అప్రమత్తంగా ఉండి సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. గ్రామ వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్ర సభ్యులు పాల్గొన్నారు.

కామవరం రస్తాకు మహర్దశ



నేడు - మెయిన్ రోడ్డు నుంచి కామవరం వెళ్లే రహదారి



నాడు - కామవరం రోడ్డు దుస్థితి

కౌతాళం: రెండు దశాబ్దకాలం నుంచి ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో శివప్పనగర్, ఎస్సీ కొత్త కాలనీ వాసులు, కామవరం వెళ్లే ప్రయాణికులు, రైతుల కల నేరవేరింది. కౌతాళం మెయిన్ రోడ్డు నుంచి కామవరం గ్రామానికి వెళ్లే రస్తా గతంలో గుంతలు పడి అధ్వానంగా ఉండేది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకమే. రైతులు తమ పొలాలకు వెళ్లలన్నా, పండించిన ధాన్యం ఇంటికి తరలించాలన్నా ఎన్నో ఇబ్బందులు ఉండేవి. రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలని గత ప్రభుత్వం హయంలో ఎన్నో సార్లు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ పాలనలో సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.18 లక్షలు మంజూరు చేయించారు. దీంతో మెయిన్ రోడ్డు నుంచి శివప్పనగర్ ట్యాంకు వరకు సిమెంటు రోడ్డుతో పాటు ఒక ప్రక్క డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఆయా కాలనీవాసులు, కామవరం గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా పూర్తి అవుతుండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.